రేపు ఆర్ఆర్బి, గ్రూప్-డి మాక్‌టెస్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా ఆర్ఆర్‌బి, గ్రూప్-డి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఈనెల 12న మాక్ టెస్టును నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఉమెన్స్ కళాశాల రోడ్డులోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మాక్ టెస్ట్ రిజిస్ట్రేషన్ లింక్ https://www.yvssrikakulam.live/register ద్వారా రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు పరీక్ష రోజు ఉదయం పది గంటలకు హాజరు కావాలని సూచించారు. గతంలో రిజిస్టర్ చేసుకున్నా, మరోసారి నమోదై హాల్ టిక్కెట్‌ను పొందాలని కోరారు. జిల్లాలోని నిరుద్యోగులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి ఈ మాక్ టెస్ట్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

గొట్టాబ్యారేజీకి పొంచి ఉన్న ముప్పు

- వరద ఉధృతికి దెబ్బతింటున్న రక్షణ గోడలు
- ఇప్పటికే దెబ్బతిన్న అప్రాన్
- రెండు పర్యాయాలు పరిశీలించిన ఇంజినీరింగ్ నిపుణుల కమిటీ
- రూ.16.70 కోట్లతో ప్రతిపాదనలు పంపినా ఆమోదం తెలపని ప్రభుత్వం

హిరమండలం వద్ద వంశధారపై నిర్మించిన గొట్టాబ్యారేజీకి ముప్పు పొంచి ఉందని ఇంజినీరింగ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కడప జిల్లాలో 2021, నవంబర్ 19న అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో అప్రమత్తమైన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులు, బ్యారేజీల భద్రతపై 11 మంది సభ్యులతో ఇంజినీరింగ్, సాంకేతిక నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. గతేడాది ఏప్రిల్‌లో మరో కమిటీ సందర్శించి పరిశీలించి, కొత్త డిజైన్లను రూపొందించింది. అందుకనుగుణంగా వంశధార అధికారులు ఆరు నెలల కిందట రూ.16.70 కోట్లతో ప్రతిపాదనలు పంపినా నేటికీ ఆమోదం తెలపలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు వంశధారలో లక్ష క్యూసెక్కుల వరద రావడంతో బ్యారేజీ దిగువ భాగాన రక్షణ గోడలు కోతకు గురయ్యాయి. అప్రాన్ దెబ్బతినడం, గోడలు కోతకు గురవడంతో బ్యారేజీ భద్రతపై అందరిలోనూ ఆందోళన నెలకొంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం మండలంలో 0.612 టిఎంసిల సామర్థ్యంతో 1977లో బ్యారేజీని నిర్మించారు. బ్యారేజీ ఎగువ భాగంలో ఎడమవైపున 3.6 కిలోమీటర్లు, కుడివైపు 6.2 కిలోమీటర్ల మేర వరద కట్ట నిర్మించారు. బ్యారేజీకి ఆనుకుని దిగువ, ఎగువ భాగంలో 11.06 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ బ్లాక్‌లతో దృఢమైన అప్రాన్‌ను నిర్మించారు. అప్రాన్‌కు సపోర్టుగా పెద్ద పెద్ద బండరాళ్లను కట్టగా పేర్చారు. 2008, 2010 ఆగస్టులో వచ్చిన వరదలతో అప్రాన్ క్రమేణా దెబ్బతింటోంది. బ్యారేజీ దిగువ భాగంలో తాత్కాలికంగా మూడు మీటర్ల మేర రాళ్లను వేశారు. బ్యారేజీ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో 2012, మార్చి 26న రూ.3.48 కోట్లతో 2014 మరమ్మతులు చేపట్టారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు మరోసారి బండరాళ్లు కొట్టుకుపోయాయి. 2015లో హైదరాబాద్ నుంచి సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నుంచి వచ్చిన చీఫ్ ఇంజినీర్ సర్వే చేసి, అదే ఏడాది మేలో తనిఖీ నివేదిక సమర్పించింది. బ్యారేజీ దిగువ భాగంలో అత్యవసర రక్షణ చర్యలు చేపట్టాలని సూచించింది. అధికారులు పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన అప్పటి ప్రభుత్వం రూ.9.72 కోట్లు కేటాయిస్తూ 2017 ఫిబ్రవరి ఏడో తేదీన ఉత్తర్వులను వెలువరించింది. అప్పట్నుంచి పనులు చేపట్టకుండా పాలకులు నాన్చుతూ వచ్చారు. 2021-22 ధరల ప్రకారం దాని వ్యయం రూ.12.91 కోట్లకు చేరింది. ప్రస్తుతం రూపొందించిన డిజైన్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలంటే రూ.16.70 కోట్లు అవసరం కానున్నాయి. గతంలో ఇచ్చిన జిఒ మేరకు తొలుత పనులు చేయాలని, ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది. గొట్టాబ్యారేజీలో 22 గేట్లు ఉండగా, ఆ నిధులతో చేపట్టే పనులు 19 గేట్ల వరకు పనులు పూర్తయ్యే అవకాశం ఉందని వంశధార అధికారులు అంచనా వేస్తున్నారు. నిధులు చాలకపోతే తర్వాత సర్దుబాటు చేస్తామని ప్రభుత్వం సూచించడంతో, ఇందుకనుగుణంగా అధికారులు కొత్త ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.



వరద గట్ల పనులకు క్లియరెన్స్ ఎప్పుడో..?

వంశధారకు 80 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిన సందర్భంతో 2023 ఆగస్టులో హిరమండలం బ్యారేజీ దిగువ భాగాన కొంతమేర వరద గట్టు కోతకు గురైంది. గట్టుకు అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.10 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వంశధార కాలువ గట్లు ఎంత బలహీనమో 2021, జూలై 15న హిరమండలం వద్ద ఎడమ కాలువ కోతకు గురవడం పరిశీలిస్తే తేటతెల్లమవుతుంది. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు మట్టి నానిపోవడంతో గొట్టాబ్యారేజీకి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఎలకల మెట్ల సమీపంలో కొంత గట్టు కొట్టుకుపోయింది. అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టినా, ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.



గొట్టాబ్యారేజీ దిగువ వైపున కోతకు గురైన రక్షణ గోడ

నిలిచిన ఎన్‌టిఆర్ వైద్య సేవలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎపి స్పెషాలిటీ ఆస్పత్రు అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలో పలు ఆస్పత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలు నిలిచిపోయాయి. నెట్‌వర్క్ ఆస్పత్రులకు రావాల్సిన బకాయిలు చెల్లింపులు చేపట్టకపోవడంతో చేపట్టిన బంద్‌లో పలు ఆస్పత్రులు వైద్య సేవలను నిలిపివేశాయి. ఎన్‌టిఆర్ వైద్య సేవ ప్యానల్ జాబితాలో జిల్లాలో మొత్తం 13 ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో కొన్ని పూర్తిస్థాయిలో, మరికొన్ని పాక్షికంగా బంద్ పాటించాయి. శ్రీకాకుళం నగరంలోని కిమ్స్, ఎ1 ఆస్పత్రులు అత్యవసర సేవలను సైతం ఆపేశాయి. పొందూరు, రణస్థలంలోని పి.వి.ఎస్ రామ్మోహన్‌రావు ఫౌండేషన్, రాగోలులోని జెమ్స్, శ్రీకాకుళంలోని శంకర్ ఫౌండేషన్, సత్యసాయి, దినేష్ ఆస్పత్రులు ఐపి, ఒపి ఆపేసి అత్యవసర సేవలను అందించాయి. ఎన్‌టిఆర్ వైద్యసేవల బంద్ నేపథ్యంలో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. రోగులను ప్రభుత్వాస్పత్రులకు అత్యవసరంగా తరలించేందుకు 108, 104 వాహనాలను సిద్ధం చేసి అందుబాటులో ఉంచామని జిల్లా ఎన్‌టిఆర్ వైద్యసేవల కో-ఆర్డినేటర్ ప్రకాశరావు తెలిపారు.

చోరీ కేసులో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - నరసన్నపేట



కేసు వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి లక్ష్మణరావు

చోరీ కేసులో ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు, మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు టెక్కలి డిఎస్‌పి లక్ష్మణరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల మూడో తేదీన నరసన్నపేట మండలం నడగాంకు చెందిన దొంపాక ఆనంద రమణ ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై నరసన్నపేట వెళ్తుండగా మార్గమధ్యలో ఉర్లాం హైస్కూల్ దగ్గర రాజమండ్రికి చెందిన ట్రాన్స్‌జెండర్లు నేహ, మండలి శ్రావణి, అల్లుబిల్లి ప్రియ, బెదంపూడి సాయిపల్లవి, నాగిరెడ్డి సుష్మ వాహనాన్ని ఆపి డబ్బులు అడిగారు. అతను చిల్లర లేదని, తిరిగి వచ్చేటప్పుడు ఇస్తానని చెప్పగా అసభ్యకరంగా ప్రవర్తించి దౌర్జన్యం చేసి అతని మెడలో ఉన్న తులంపావు బంగారు గొలుసు లాక్కొని వెళ్లిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా శుక్రవారం మడపాం టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, శ్రీకాకుళం నుంచి నరసన్నపేట వైపు వస్తున్న కారులో వీరు పట్టుబడ్డారు. వీరితో పాటు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కారు డ్రైవర్ సేలం రామ్ ప్రవీణ్‌ను అరెస్టు చేశారు. రామ్ ప్రవీణ్ ట్రాన్స్‌జెండర్లు చోరీ చేసిన అనంతరం వారిని కారులో ఎక్కించి తప్పిస్తుంటాడని డిఎస్‌పి తెలిపారు. వీరిలో మండలి శ్రావణిపై తెలంగాణ రాష్ట్రంలో, నేహపై కృష్ణా జిల్లాలో ఇదే తరహా నేరంపై కేసులు ఉన్నాయన్నారు. సమావేశంలో సిఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ పోలాకి ఎస్ఐ జి.రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ప్రజా ప్రతినిధులు, అధికారుల లక్ష్యం కావాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. స్థాయి సంఘ సమావేశాలకు కచ్చితంగా జిల్లాస్థాయి అధికారులు హాజరు కావాలని స్పష్టం చేశారు. సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంతో పాటు సకాలంలో పరిష్కరించాలన్నారు. ఎవరైనా జిల్లా అధికారులు రాని పరిస్థితులు ఉంటే ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. కవిటి, సోంపేటలో కిడ్నీ బారిన పడిన వారికి డయాలసిస్ సేవలు సకాలంలో అందించాలని, డయాలసిస్ బెడ్‌లు పెంచాలని సభ్యులు కోరారు. చాలామంది అర్హుల పింఛన్ల జాబితాలు ఎంపిడిఒల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సకాలంలో క్లియర్ చేయాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు, గోశాలల బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులు, ఇంకా ప్రారంభం కాని పనుల వివరాలను సమర్పించాలని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఉద్దానం ప్రాజెక్ట్ పైప్‌లైన్లలో ఎక్కువ లీకేజీలు ఉన్నాయని, సత్వరమే మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని సభ్యులు కోరారు. ఒకటో స్థాయీ సమావేశంలో లోఓల్టేజీ, విద్యుత్ అంతరాయం, వ్యవసాయ విద్యుత్ సమస్యలపై సభ్యులు ప్రస్తావించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ జలవనరుల శాఖ అధికారుల తీరు బాగా లేదని, రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ డి.సత్యనారాయణ, పలు శాఖల అధికారులు, జెడ్‌పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

ప్రజాశక్తి - కొత్తూరు, మెళియాపుట్టి

ఐటిడిఎ ద్వారా చేపడుతున్న ఇంజినీరింగ్ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పవార్ సప్నిల్ జగన్నాథ్ హెచ్చరించారు. మండలంలోని కొత్తగూడలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతం చేసి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న మెళియాపుట్టి మండలంలోని కేరాసింగి రోడ్డును ఐటిడిఎ పిఒ పరిశీలించారు. రహదారి మరమ్మతుల కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఇఇ రమాదేవి, డిఇ సిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు : నివేదికలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పకడ్బందీగా అట్రాసిటీ చట్టం అమలు

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం అమలును పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలు స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పలు కేసుల్లో గత మూడు నెలల్లో ఇప్పటివరకు బాధితులకు రూ.18 లక్షల వరకు పరిహారం చెల్లించామని తెలిపారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి కేసులపై, వెనుకబడిన తరగతులపై దాడులు, భూ కబ్జాలకు సంబంధించిన సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర సామాజిక తరగతుల ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అనేక కేసుల్లో విచారణ పూర్తవలేదని, అన్యాయం జరిగిన ప్రతి బాధితునికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో అట్రాసిటీ కేసుల కారణంగా అన్యాయానికి గురైన కొందరు ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఎఎస్‌పి శ్రీనివాసరావు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, బిసి కార్పొరేషన్ ఇడి గెడ్డమ్మ, బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ, కమిటీ సభ్యులు గేదెల రమణమూర్తి, దాసరి తిరుమలరావు, దండాసి రాంబాబు, తోట రాములు, కళింగపట్నం అప్పన్న, చల్లా శాంతారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు

- మహదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి
- పోస్టల్ కార్యాలయాల వద్ద ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గ్రామీణ తపాలా ఉద్యోగుల సంక్షేమం కోసం నియమించిన కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన సిఫార్సులను అమలు చేయాలని పోస్టల్ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు నాయకత్వం వహించిన మహదేవయ్యపై కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడిందని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ల నాయకులు గణపతి, బాబూరావు, యు.వి రమణ విమర్శించారు. ఆయనకు ఛార్జిషీట్ ఇచ్చి కక్షపూరితంగా ఈనెల 8వ తేదీన ఉద్యోగం నుంచి తొలగించిందని తెలిపారు. తక్షణమే ఆయన్ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ల దేశవ్యాప్త పిలుపులో భాగంగా శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌లోని అన్ని పోస్టాఫీసుల ముందు శుక్రవారం నిరసన కార్యక్రమాలను చేపట్టారు.

ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సుల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 2023 డిసెంబరులో ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నాయకులు మహదేవయ్య నాయకత్వంలో నాలుగు రోజులపాటు సమ్మెను నిర్వహించినట్లు తెలిపారు. కక్షసాధింపుతో కేంద్ర ప్రభుత్వం ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించిందన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి అణచివేసే నిరంకుశ విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శివప్రసాద్, మాధవ, రామకోటి, గురన్న తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై దృష్టి

ప్రజాశక్తి - పలాస

గ్రామాల్లో వేస్తున్న అనాధికార లేఅవుట్లను గుర్తించి అనుమతులు తీసుకొనేలా చూడాలని ఎంపిడిఒ వసంత కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సుడా అధికారుల ఆధ్వర్యంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరజేషన్ స్కీం) క్రింద లే అవుట్ మార్చుకొనే అందుకు అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని లే అవుట్ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుమతి లేని లే అవుట్లను అదారైజడ్ చేసుకోవడం ద్వారా వినియోగదారులు స్వేచ్ఛగా ఇళ్ళ నిర్మాణాలు చేపట్టు కోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎ.అనురాధ, సుడా అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపట్నుంచి ఎపిఇఎపి సెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎపిఇఎపి సెట్ బైపిసి స్ట్రీమ్ చివరి విడత కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యా మండలి షెడ్యూల్ విడుదల చేసినట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 నుంచి ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ 13, 14 తేదీల్లో జరుగుతుందని తెలిపారు. 14 నుంచి 17వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. 18న ఆప్షన్ల మార్పు, 21న ఎలాట్‌మెంట్‌ల ప్రకటన ఉంటుందని పేర్కొన్నారు. 21 నుంచి క్లాస్ వర్కు ప్రారంభం కానుందని తెలిపారు.

జిల్లా సమీక్షా కమిటీ సమావేశం వాయిదా

శ్రీకాకుళం సిటీ : ఈనెల 11వ తేదీన నిర్వహించాల్సిన జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రకటనలో తెలిపారు. తదుపరి సమావేశ నిర్వహణ తేదీ, సమయాన్ని తెలియజేస్తామని పేర్కొన్నారు. సమావేశ వాయిదా విషయాన్ని అధికారులు గమనించాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

జాబ్‌మేళాలతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నిరుద్యోగ యువతకు విద్యార్హతల ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నగరంలోని అభ్యుదయ డిగ్రీ కాలేజ్‌లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు 863 మంది అభ్యర్థులు హాజరు కాగా, 372 మందికి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 18 కంపెనీలు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఎంపికైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువత జాబ్‌మేళాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నైపుణ్యం, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో కంపెనీలే అభ్యర్థుల వద్దకు వచ్చి ఎంపిక చేసుకునేలా పరిస్థితులు మెరుగుపడ్డాయన్నారు. ఉద్యోగం లభించిన వెంటనే చేరి, నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఉజ్వల్, అభ్యుదయ కళాశాల డైరెక్టర్ శ్రీధర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ మాట్లాడుతూ, అభ్యర్థులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విప్ అశోక్

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి- కవిటి

కూటమి ప్రభుత్వంలో మౌలిక వసతుల కల్పనకు పూర్తిస్థాయిలో ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మండలంలోని పాత కొజ్జిరియాలో పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ రహదారుల నిర్మాణంతో గ్రామాలకు మెరుగైన రవాణా సదుపాయం కలుగుతుందన్నారు. అనంతరం పంచాయతీ ప్రజలు, పెద్దల ఆధ్వర్యంలో విప్ అశోక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎపిఎస్ వైస్ చైర్మన్ ప్రకాష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల దినబాబు, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, జడ్‌ఆర్‌యుసిసి మెంబర్ శ్రీనివాస రౌళో, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, నాయకులు సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, బెందాళం తిరుమల కుమార్, కొండా శంకర్ రెడ్డి, ఎంపిడిఒ తిరాప్, ఎఒ శ్రీనివాస రెడ్డి, కవిటి నాయకులు పాల్గొన్నారు.


హోంగార్డుకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

హోంగార్డుకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా పోలీసుశాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు ఎల్.వి.ఆర్ మూర్తికి సహచర ఉద్యోగులు స్వచ్ఛందంగా సమకూర్చిన రూ.4.08 లక్షల నగదు చెక్కును జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుశాఖ కుటుంబంలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన సహచరునికి సహోద్యోగులు ఆర్థిక చేయూత అందించడం మంచి సంప్రదాయమన్నారు. ఇలాంటి సంఘటనలు పోలీసు సిబ్బందిలోని ఐక్యతను, మానవతా విలువలను ప్రతిబింబిస్తాయన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై దృష్టి పెట్టి కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయం ఎఒ గోపినాథ్, ఆర్‌ఎస్‌ఐ వెంకటరమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళ్యాణ్ చక్రవర్తి

ఆకర్షణకు లోనుకావద్దు

ప్రజాశక్తి- కవిటి

చదువుకునే దశలో ఆకర్షణకు లోనుకావొద్దని, అందులోనూ ఇంటర్మీడియట్ దశ కీలకమని బిఎస్‌ఆర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ పి.కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. బిఎస్‌ఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల ఫ్రెషర్స్ డే వేడుకలు కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కుటుంబసభ్యుల ఆశలు నెరవేర్చాలని సూచించారు. భవిష్యత్‌లో మీకు గుర్తింపు తెచ్చేది చదువేనని, దానికి ఇప్పటి నుంచే బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కృష్ణారావు, జల్లు సుబ్బారావు, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సిఐటియు పోరాట ఫలితమే జిఒ రద్దు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విఒఎలకు మూడేళ్ల కాలపరిమితి గల చీకటి జిఒ రద్దు సిఐటియు పోరాట ఫలితమేనని సిఐటియు మండల కన్వీనర్ ఎన్.మోహనరావు అన్నారు. శుక్రవారం నగరంపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ మూడేళ్ల కాలపరిమితి వలన విఒఎలకు ఉగ్యోగ భద్రత లేక ఎప్పుడు ఉంటామో, ఊడుతామో అని బిక్కుబిక్కుమని జీవనం గడుపుతూ, ఉగ్యోగం చేసే వారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలన్నింటిని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో, డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంలో, సామాజిక అంశాలలో విఒఎల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. విఒఎలు అందరికి ఇన్సూరెన్స్ కూడా ప్రభుత్వమే చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా నాయకులు బి.సుగుణావతి, ఆశావర్కర్ల నాయకులు బి.లక్ష్మి, విఒఎల నాయకులు ఎన్.ధనలక్ష్మి, డి.శాంతి, ఎం.విజయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి- నందిగాం

స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఒఎస్‌ఆర్‌పై రెండవ రోజు శిక్షణ కార్యక్రమం నేటితో ముగిసింది. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.వి రమణ పాల్గొని పంచాయతీల అభివృద్ధికి సొంత నిధుల సమీకరణ వంటి అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుమార్ పట్నాయక్, డిప్యూటీ ఎంపిడిఒ సంతోష్ కుమార్, కార్యదర్శులు రమణబాబు, సర్పంచ్‌లు సత్యం, కె.ఎర్రన్న, పి.లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తిరుపతిరావు, మాస్టర్ ట్రైనీలు రాంబాబు, అమర్నాథ్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మందస: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ వెంకటరమణ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, కార్యదర్శులతో రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. శిక్షకుల ట్రైనర్‌గా కె.కూర్మారావు, ఇన్‌ఛార్జి పంచాయతీ అధికారిగా జయప్రకాష్ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


నందిగాం : మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రమణ

కొత్తూరు: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎంపిడిఒ బసవ రాంబాబు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బి.సుదర్శన్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పలాస: ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎ.అనురాధ, సర్పంచ్‌లు శాసనపురి తిరుమలరావు, వరిశ రామారావు, దువ్వాడ వామాక్షి, సీనియర్ అసిస్టెంట్ మన్మథరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి- కొత్తూరు

రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం పారాపురం గ్రామంలో రీ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ.సర్వేతో రెవెన్యూ అధికారులు రైతులు సహకరించాలన్నారు. భూములకు సంబంధించిన హక్కుపత్రాలను చూపించి సర్వేను ఎటువంటి ఆటంకాలు లేకుండా ముందుకు పోవాలన్నారు. అనంతరం రైతులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.బాలకృష్ణ, ఎంపిపి సవర సావిత్రి, టిడిపి నాయకులు కె.నూకరాజు, గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నందకుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లావేరు: రీ సర్వేతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ జివిఎల్‌ఇ శ్రీనువాసరావు అన్నారు. గుమ్మడాం, వాళ్ళపేట గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రీసర్వే డిటి రాపర్తి అప్పలరాజు, మండల సర్వేయర్ బచ్చు శ్రీధర్ రెడ్డి, సర్వేయర్లు, విఆర్‌ఒలు, రైతులు పాల్గొన్నారు.


కొత్తూరు : ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌డిఒ తదితరులు

మెళియాపుట్టి: మండలంలోని వెంకటాపురంలో రీసర్వే కార్యక్రమం నిర్వహించారు. భూ పట్టాల పరిశీలన, భూముల హద్దుల గుర్తింపు, యజమానుల వివరాల నమూనా సేకరణ తదితర విషయాలపై అధికారులు చేపట్టారు. మాజీ వైస్ ఎంపిపి బైరిసింగి దినకర్, విఆర్‌ఒ లత, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


పైపులైన్ పనులు పరిశీలిస్తున్న డిఇఇ సుబ్బలక్ష్మి

జలజీవన్ మిషన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా జరుగుతున్న పనులను శుక్రవారం డిఇఇ సుబ్బలక్ష్మి పరిశీలించారు. ఇటీవల రోడ్ల మరమ్మతుల సమయంలో తాగునీటి పైపులు మరమ్మతులకు గురయ్యాయన్నారు. ప్రస్తుతం వాటర్ ట్యాంక్ పైప్‌లైన్లతో పాటు ఇతర పనులు చేపట్టామని, త్వరలోనే తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జెఇ ఎన్‌వికె నాయుడు, కార్యదర్శి బలివాడ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


దుకాణ పత్రాలను పరిశీలిస్తున్న సిఐ సత్యనారాయణ

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- పొందూరు

దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయదారులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాల్సిందేనని ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని పిల్లలవలస, బురిడికంచరాం వద్ద గల బాణాసంచా లైసెన్స్ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాణాసంచా విక్రయ సమయంలో ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా ముందుస్తు జాగ్రత్తలను తీసుకోవాలని విక్రయదారులకు సూచించారు. దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను, దుకాణాల లైసెన్స్ పత్రాలను, సామగ్రి నిల్వల రికార్డులను పరిశీలించారు. మండలంలో అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈయనతో పాటు ఎస్‌ఐ వి.సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రేపటి భవిష్యత్ మన చేతుల్లో ఉంది అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నవ్యశ్రీ మహంతి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం సత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఆర్.గోపాలరావు, ఎజిఎంఒ ప్రియ, సుధాకర్, అధ్యాపకులు వై.జనార్ధనరావు, పి. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ వాలిడేషన్ బిల్లు రద్దు చేయాలి

శ్రీకాకుళం సిటీ: పార్లమెంటులో దొడ్డిదారిన ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ బిల్లు రద్దు చేయాలని శ్రీకాకుళం ఫోరం ఆఫ్ పెన్షనర్స్ డిమాండ్ చేశారు. నగరంలోని పోస్టుఆఫీస్ వద్ద ఉద్యోగులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఆల్ ఇండియా ఫోరం పెన్షనర్స్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నాయకులు ప్రసాదరావు, చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లులతో పాటు, కేన్సర్ వ్యాలిడిషన్ బిల్లును దొడ్డితోవన అక్రమంగా ప్రవేశపెట్టిందని అన్నారు. జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమం చేపడుతున్నారని చెప్పారు. ఢిల్లీలో ఉద్యమానికి మద్దతుగా తాము ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ బిల్లు రద్దు చేయాలని, ఎనిమిదో వేతన సవరణ కమిటీ తక్షణం ఏర్పాటు చేయాలని, గతంలో పెన్షనర్స్ కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. యూనియన్ నాయకులు సింహాచలం, రమేష్, భాస్కరరావు, వెంకటేశ్వరరావు, సూరయ్య, చరణ్, వెంకట్రావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- కవిటి

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా పరిషత్ ఒడియా ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి మాధబో బెహరా ఎంపికయ్యాడు. ఇటీవల శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన పోటీలో అండర్ -19 నడక విభాగంలో మాదబో బెహరా ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఉపాధ్యాయుడు ప్రసాద్ పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు అభినందనలు

టెక్కలి: టెక్కిలి బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న స్నేహానిక, అనూష, వాగ్దేవి, అక్షయ, శరణ్య విద్యార్థినులను శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం నౌపడ శోభారాణి అభినందించారు. ఇటీవల నిర్వహించిన స్కూలుస్థాయి గేమ్స్ పోటీల్లో పాల్గొని వివిధ రకాల పోటీల్లో విజేతలుగా నిలిచిన వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందించదగ్గ విషయం అన్నారు. విజేత విద్యార్థులతో పాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యకాంతం, ఢిల్లేశ్వరులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టెక్కలి : విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలి

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత గల ప్రతి వ్యక్తికి సక్రమంగా చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి తమ్మినేని శారద అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే రవికుమార్ హాజరయ్యారు. ముందుగా సమావేశంలో కోర్లకోట ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు సచివాలయ సిబ్బంది విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రస్తావించగా ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన సచివాలయ ఉద్యోగులు విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒను ఆదేశించారు. వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావుకు ఈ క్రాప్ నమోదు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గృహనిర్మాణ శాఖ ఇఇ సన్యాసిరావు ఇళ్ల లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు అందించడంలో జాప్యం జరుగుతోందని చెప్పగా కారణమేమిటని తహశీల్దార్ రాంబాబును ఎమ్మెల్యే ప్రశ్నించారు. వెంటనే విఆర్‌ఒల ద్వారా పరిశీలించి సర్టిఫికెట్లు పంపిణీ చేయాలని సూచించారు. జగనన్న కాలనీల వివరాలు తెలియక బిక్క మొహం పెట్టడంతో ఇఇ సన్యాసిరావుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సంతకొత్తవలస జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు ఒకరి వద్ద ఉండి విక్రయాలు జరుగు తున్నాయని జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించని లబ్ధిదారుల పట్టాలు ప్రభుత్వం రద్దు చేసిందని పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని తహశీల్దార్ రాంబాబును ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ రోణంకి వెంకట్రావు, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు, సర్పంచ్ నూక రాజు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మృతి

ప్రజాశక్తి- బూర్జ, ఆమదాలవలస


సత్యప్రసాద్ (ఫైల్)

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పైడి సత్యప్రసాద్ (65) శుక్రవారం న్యూఢిల్లీలో మృతి చెందారు. ఈయన గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిసిసిబి మెంబర్‌తో పాటు పలు పదవులను చేపట్టారు. ముఖ్యంగా ఈయన తండ్రి పైడి శ్రీరామ్మూర్తి 1989లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆమదాలవలస నియోజవర్గ ఎమ్మెల్యేగా పనిచేశారు. ప్రస్తుతం సత్యప్రసాద్ టిడిపిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ గెలుపుకోసం ఎనలేని కృషిచేశారు. సత్యప్రసాద్‌కు భార్య అమ్మాజమ్మ, కుమారులు ఉన్నారు. సత్యప్రసాద్ మతివార్త ఆమదాలవలస నియోజకవర్గంలో తెలియడంతో విషాద ఛాయలు అలముకున్నాయి. పలువురు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ప్రగాఢ సానుభూతిని తెలిపారు

గాయపడిన వ్యక్తి మృతి

రణస్థలం : జె.ఆర్. పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రావాడ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లంకపేట గ్రామానికి చెందిన సనపతి సూర్యనారాయణ (30) శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. వివరాల్లోనికి వెళ్తే.. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంతో రణస్థలం నుంచి తన స్వగ్రామం లంకపేట వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వెంటనే స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రికి తీసుకుని వెళ్లి చికిత్స అందించారు. నిరుపేద కుటుంబం కావడంతో డబ్బులు వెచ్చించలేక శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందు తూ గురువారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య అన్నపూర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ప్రమాదంపై భార్య అన్నపూర్ణ జె.ఆర్.పురం పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మంటలను అదుపు చేస్తున్న పోర్టు అగ్నిమాపక సిబ్బంది

సిమెంట్ లారీలో మంటలు

సంతబొమ్మాళి: మూలపేట పోర్టు సమీపంలో శుక్రవారం సాయంత్రం సిమెంట్ తీసుకువెళ్తున్న ఒక లారీలో అగ్నిప్రమాదం సంభవించింది. ఇంజన్ భాగంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో, కొద్ది సేపట్లోనే లారీ కేబిన్ దగ్ధమైంది. డ్రైవర్, క్లీనర్లు సమయానికి బయటపడి ప్రాణాపాయం తప్పించుకున్నారు. పోర్టు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. లారీ దగ్ధంతో లక్షల రూపాయల నష్టం జరిగినట్లు తెలుస్తోంది.

బాలికలు అభివృద్ధి చెందాలి

టెక్కలి: ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను విద్యార్థులు వినియోగించుకొని అభివృద్ధి దిశలో ముందుకు వెళ్లాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో లీడ్ గర్ల్స్ ఆన్ ది ఫ్రంట్ లైన్ అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థినిలు సామాజిక, సాంఘిక రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.సుధా రాణి మాట్లాడు తూ విద్యార్థులు చదువుతో పాటు మంచి ప్రవర్తన, బాధ్యత అవసరమన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బేపల సతీష్ కుమార్, జాతీయ సేవా విభాగం పిఒలు లూకేపాల్, లీలా పద్మజ, డి.వాసుబాబు, కందిగొల్ల, రామారావు పాల్గొన్నారు.


చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజు

వైద్య సమస్యలపై వినతి

ప్రజాశక్తి- సోంపేట

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ చిల్లిపల్లి శ్రీనివాసరావును విజయవాడ తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి నియోజక వర్గంలోని వైద్య సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సూచనల మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉన్న ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రాలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కోసం తెలియజేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా బారువ నూతన ఆస్పత్రిని త్వరితగతిన పనులు చేపట్టి పనులు పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకుని రావాలని, అలాగే పాత భవనాన్ని డయాలసిస్ కేంద్రంగా చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే ఇచ్ఛాపురం డయాలసిస్ కేంద్రానికి జనరేటర్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఈ అంశాలపై చైర్మన్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తానని చెప్పారన్నారు. కార్యక్రమంలో కంచిలి మండల అధ్యక్షులు డొక్కరి ఈశ్వరరావు, ఎఎంసి వైస్ చైర్మన్ పెద్దింటి చందు, పిఎసిఎస్ సభ్యుడు పాపారావు, కుసుంపురం జనసేన సర్పంచ్ అభ్యర్థి అంగ సురేష్ కుమార్, వీర మహిళ శైలజ, జనసేన నాయకులు హేమాచాలపతి, ఎమ్‌ఎఫ్ సిఎస్ అధ్యక్షులు గండుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పారావు మాస్టారు సేవలు ప్రశంసనీయం


అప్పారావుకు సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గత మూడున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ తెర్లాం మండలం నందిగాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సైన్స్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విరమణ చేసిన మాడుగుల వెంకట అప్పారావు, రమాదేవి దంపతులను పాఠశాల విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయునిగా 36 సంవత్సరాల సర్వీసులో విద్యార్థులకు చిత్తశుద్ధి, అంకితభావంతో అందించిన సేవలను వారు కొనియాడారు. సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్ దున్న రమేష్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్, ఎస్.ఎం.పురం రెసిడెన్షియల్ స్కూల్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పాలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వేపాడ, జామి మండలం అన్నంరాజు పేట, బొబ్బిలి మండలం గాదెలవలస, నరసింహుని పేట, కృష్ణాపురం, తెర్లాం మండలం గదబవలస, నందిగాం పాఠశాలల్లో ఎస్‌జిటిగా, స్కూల్ అసిస్టెంట్‌గా సేవలు అందించి ఈ ఏడాది సెప్టెంబర్ 30న నందిగాం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ చేశారు. ఆయనతో కలిసి వివిధ ప్రాంతాల్లో పనిచేసిన ఉపాధ్యాయులు పెద్దఎత్తున వచ్చి .వెంకట అప్పారావును సన్మానించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మండలం బొంతల కోడూరు మాజీ సర్పంచ్ మాడుగుల వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివద్ధికి ఎనలేని కృషి

మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పలాస

పాఠశాల అభివృద్ధికి సీమల వెంకట రమణారావు ఎంతో కృషి చేశారని మండల విద్యాశాఖాధికారులు సిహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం అన్నారు. మండలం బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సీమల వెంకట రమణారావు, పద్మావతి దంపతులకు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమణారావు ఉపాధ్యాయ వృత్తి చేపట్టి నుంచి ఉద్యోగ విరమణ వరకు పాఠశాల అభివృద్ధి కోసం పరితపించారన్నారు. విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టడమే కాకుండా డ్రాపౌట్ పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు ఎంతో శ్రమపడ్డారని కొనియాడారు. తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో పాఠశాల ఆవరణలో తరగతి గదుల భవనాలు నిర్మాణం చేపట్టడం, దేశనాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. వెంకట రమణారావు గ్రామంలో పుట్టి చదువుకున్న పాఠశాలలో ఉద్యోగం చేపట్టి అదే పాఠశాలలో ఉద్యోగ విరమణ చేపట్టే అవకాశం అంత మందికి రాదని, అటువంటి అవకాశం రమణారావుకు దక్కిందన్నారు. సొంత నిధులతో పాఠశాలలో పనులు చేపట్టి విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించే వ్యక్తి రమణారావు మాస్టార్ అని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తారకేష్ పండా, రమణారావు కుటుంబ సభ్యులు సాయిరామ్, జి.దీపిక, సాయిదినేష్, సాయి ఉదయ్, విశ్రాంత ఎంఇఒ డి.నాగేశ్వరరావు, రంగోయి, పెదంచల, కాశీబుగ్గ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు ఉప్పాడ రమేష్, బల్ల సుభాష్, చిన్నం నాయుడు, కణితి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, మధు, పాఠశాల కమిటీ చైర్మన్ బాల శంకర్, రేణుకా దేవి, కె.రమేష్, బి. సుధారాణి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రమణారావుకు సన్మానం చేస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

పాఠశాలల్లో మానసిక ఆరోగ్య దినోత్సవం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండలం నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ఎం.భాను ప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మానసిక ఆరోగ్య ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యంతో సమానంగా కీలకం. ఆరోగ్యకరమైన మనస్సే సంతోషకర జీవితానికి పునాది' అని పేర్కొన్నారు. కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎస్.వరంతేజ మాట్లాడుతూ 'నిజమైన ఆనందం మానసిక సమతుల్యంలోనే ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ మనసిక ఆరోగ్యాన్ని కాపాడు కోవాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల పాల్గొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరసవల్లి: ఒత్తిడిని జయిస్తే, సంపూర్ణ ఆరోగ్యం మన అందరికీ సొంతమవుతుందని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు లయన్ డాక్టర్ పైడి.సింధూర అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రపంచ మానసిక దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు జనరల్ సర్జన్ లయన్ మొదలవలస మురళీ కృష్ణ, క్లబ్ జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ లయన్ పొన్నాడ రవికుమార్, ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ, సభ్యులు డా.పైడి ప్రదీప్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంవిఎస్ సత్యన్నారాయణ, తెలుగు అధ్యాపకులు డా.ఢిల్లేశ్వరరావు, అధ్యాపకులు లయన్స్ సభ్యులు బెందాళం వరలక్ష్మి, తెలుగు అధ్యాపకురాలు ఈశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు: బుడుమూరు ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని హెచ్‌ఎం రువ్వ పూర్ణ చంద్రరావు కోరారు. కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు, ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాద్, ఎం.అనురాధ, కె.వెంకటరావు, కె.చినపెంటయ్య, ఎస్.రమేష్‌బాబు పాల్గొన్నారు.

పలాస: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో న్యాయవాది కామేశ్వర పట్నాయక్ ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మానసిక వ్యాధి ఉన్నవారికి టోల్ 14416 ద్వారా ఆన్‌లైన్ సలహాలు, కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొమర దేవరాజు, లోకేష్, రవికుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పైల రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు గొంటి గిరిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాకుళంకు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ పాలవలస శ్రావ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.ఇందిర, లయన్స్ జిల్లా చైర్మన్ డాక్టర్ వై.మల్లిబాబు, ఉపాధ్యక్షులు అంకం ధర్మారావు, విశ్రాంత హెచ్‌ఎం పి.దివాకర్ పాత్రో, విశ్రాంత డిఇ ఎ.విజయకుమార్, సూర్యనారాయణ, యు.భరత్ కుమార్ పట్నాయక్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ జమ్మయ్య

సబ్ డిపో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ఆంపురం పంచాయతీలో సబ్‌డిపోను ఏర్పాటు చేయాలని సర్పంచ్ డి. జమ్మయ్య శుక్రవారం తహశీల్దార్ బడే పాపారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ ప్రజలకు సరుకుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సబ్ డిపో ఏర్పాటు వల్ల గ్రామస్తులకు రేషన్ సరఫరా సులభంగా జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు త్వరితగతిన స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

కోటబొమ్మాళి: జాతీయ అంధత్వ, దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 185 మందికి డిజిపురం పిహెచ్‌సి ఆప్తాలమిక్ అధికారి ఎంఆర్‌కె దాస్ నేత్ర పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న 21 మందిని గుర్తించి కళ్లద్దాలకు సిఫారసు చేశారు. వైద్యాధికారి డా కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు కంటి ఆరోగ్యం సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ జి.చిన్నతల్లి, ఆరోగ్య పర్యవేక్షకులు డి.భీమారావు, ఆరోగ్య కార్యకర్త బి.లలిత, ఆశా కార్యకర్తలు ఎం. చిన్నమ్మడు, లక్ష్మి, ఎల్.మోహిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పంట నమోదు చేస్తున్న ఎఓ ఉషారాణి

పంట నమోదు వేగవంతం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషారాణి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఈ పంట నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలో 14054 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు 9,851 ఎకరాల్లో పంట నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ముఖ్యంగా మండలంలో 59424 ఎకరాల్లో ల్యాండ్ పార్సెల్స్‌గాను ఇంతవరకు 26082 ల్యాండ్ పార్సిల్స్ పూర్తయ్యాయని వివరించారు. కొంతవరకు పంట ఉండగా మిగిలినవి పంటలేనివిగా ఉన్నాయని తెలిపారు. ఈనెల 25న వాటికి కూడా ల్యాండ్ పార్సెల్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ల్యాండ్ పార్సెల్ పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉండడం వలన గ్రామ సచివాలయాల సిబ్బంది గడువులోగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు.



పరామర్శిస్తున్న మాజీ మంత్రి శివాజీ

మాజీ మంత్రి శివాజీ పరామర్శ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దువ్వాడ జగ్గు చౌదరి కుటుంబాన్ని మాజీ మంత్రి గౌతు శివాజీ పరామర్శించారు. శుక్రవారం గుల్లలపాడు గ్రామానికి విచ్చేసి ఆయన కుమారుడు పిఎసిఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేంబాబు చౌదరిని కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుని చిత్రపటానికి నివాళ్లర్పించారు. పిజెపురంలో మృతి చెందిన తిమ్మల యర్రయ్య కుటుంబసభ్యుల్ని కలిసి తమ సానుభూతి తెలియపరిచారు. ఆయనతో టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, మాజీ ఎంపిపి గొరకల వసంతస్వామి, అరసవిల్లి ఉమామహేశ్వరరావు, పోతనపల్లి సాంబమూర్తి, గొరకల వసంతరావు, రెళ్ల దానయ్య, నెయ్యిల సూర్యనారాయణ, రాపాక శాంతమూర్తి, చెల్లూరు రాజశేఖర్, నర్తు కామరాజు, నర్తు అప్పారావు, మాజీ సర్పంచ్ తిమ్మల కృష్ణారావు , బత్తిని రంగారావు, లండ వాసు, దుక్కరామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- పొందూరు

ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న కుట్టు శిక్షణా కేంద్రంలో శుక్రవారం నారీశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. బాల్యవివాహాలు నిరోధానికి 1098, పోలీస్ ఎమర్జెన్సీకి 112 టోల్‌ఫ్రీ నెంబర్లుకు వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలకు పిపిపి విధానం వద్దు

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట నియోజకవర్గం కేంద్రంలో రాష్ట్రంలో ఉన్న 17 మెడికల్ కాలేజీలను పిపిపి విధానాన్ని రద్దు చేయాలని కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను శుక్రవారం వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: ఏపి ప్రజలకు వైసిపి ప్రభుత్వం చేసిన మంచి, కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు సవివరంగా చెప్పాల్సిన అవసరం ఉందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మణరావు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సూచించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘ భవనంలో ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకూ కమిటీలు వేసుకుని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో 60 వేల సంతకాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి ఎంపిపిలు బోర పుష్ప, డాక్టర్ ఎన్ దాసు, పి దేవదాస్ రెడ్డి, ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ దివ్య భారతి, బిసి కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, వైసిపి రాష్ట్ర రైతు కార్యదర్శి పూడి నీలాచలం, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, సోంపేట, కంచిలి జెడ్‌పిటిసి ప్రతినిధులు తడక జోగారావు, ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు.



నరసన్నపేట : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణదాస్

శ్రీకాకుళం సిటీ: రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే నిర్మించాలని వైసిపి నాయకులు ధర్మాన రామ్మనోహర్ నాయుడు డిమాండ్ చేశారు. నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అందవరపు సూరిబాబు, ఎంవి పద్మావతి, ఎన్ని ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం పెద్దబమ్మిడి పంచాయతీలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. చిన్న బమ్మిడి, పెద్ద బమ్మిడి, ఎత్తురాళ్లపాడులో వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు హేమసుందర్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు రామారావు, జెడ్‌పిటిసి వెంకటరావు, నందిగాం ఎంపిపి శ్రీరామ్మూర్తి, స్థానిక సర్పంచ్ తాతయ్య, ఎంపిటిసి మెండ జగన్, వాన అసిరినాయుడు, తలగాన గణపతి, నాయకులు లక్ష్మణరావు, సోమేశ్వరరావు, అనసూయ, చలపతి, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు వినోద్, పేడాడ వెంకటరావు, బాగాది దివాకర్, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మూతపడిన గ్రామీణ బ్యాంక్

గ్రామీణ బ్యాంకు సేవలకు అంతరాయం

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలోని విశాఖ గ్రామీణ బ్యాంకు గత రెండు రోజులుగా ఖాతాదారులకు సేవలను నిలిపివేసింది. శుక్రవారం కూడా బ్యాంకు తెరవకపోవడంతో ప్రజలు కొంతవరకు ఇబ్బందికి గురయ్యారు. నాలుగు బ్యాంకులు విలీనం కావడంతో ఈ విలీన ప్రక్రియ కారణంగా 9 నుంచి 13 వరకు మొత్తం ఐదు రోజులు బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమయంలో ఎటిఎం, యుపిఎ, ఆన్‌లైన్ సేవలు నిలిపి వేయబడతాయని తెలుస్తుంది.

పొజిషన్ సర్టిఫికెట్ వివాదం

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలోని బలదకు చెందిన ఎ.కమల తన ఇంటి స్థలం కోసం పొజిషన్ సర్టిఫికెట్ కావాలని ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని అడగ్గా, తహశీల్దార్ కె.బాలకృష్ణ ఆ స్థలం కోర్టులో ఉండడంతో సర్టిఫికెట్ ఇవ్వడానికి కుదరదని తెలిపారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటకు మాట పెరిగింది. మహిళ అని కూడా చూడకుండా తహశీల్దార్ అగౌరవంగా మాట్లాడారని ఆమె ఆరోపించింది. దీనిపై ఇరువురూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



రోగులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న ఆరోగ్య కేంద్రం

సమ్మెలో వైద్యులు

ప్రజాశక్తి- బూర్జ

ప్రభుత్వ తీరు ఫలితంగా వైద్యుల సమ్మెతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నప్పటికీ వైద్యులు లేకపోవడంతో నిరాశతో రోగులు వెనుదిరుగుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు 70 నుంచి 80 వరకు ఒపిలు వస్తుండగా సమ్మె కారణంగా కేవలం పదుల సంఖ్యలో మాత్రమే రోగులు వస్తున్నారని సిబ్బంది తెలిపారు. వివిధ సమస్యలతో వస్తున్న రోగులకు సాధ్యమైనంత వరకు వైద్యసేవలు అందజేస్తున్నామని సిబ్బంది తెలిపారు. అయితే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వివిధ సమస్యలతో బాధపడుతున్న రోగులు పాలకొండ, ఆమదాలవలస, శ్రీకాకుళం పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రిని సందర్శించడం వల్ల వ్యయ భారమవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి వైద్యుల సమస్యలు పరిష్కరించి, వారిని విధులకు హాజరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రజల సమస్యలు పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం విశాఖ ఎ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారం మార్గం చూపిస్తామన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, డ్రైన్లు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆమదాలవలస: పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి కార్యాలయ ప్రతినిధి పి.వి.కె.రాజు ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగళ్ల మురళీధర్ యాదవ్, టిడిపి నాయకులు బగాది భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



జానపద కళలు ప్రదర్శన

కళలను బతికించడమే లక్ష్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అంతరించిపోతున్న కళలను బతికించుకోవడమే ప్రధాన లక్ష్యమని అక్కుపల్లి గ్రామ సంఘం అధ్యక్షుడు మోస వరప్రసాద్ అన్నారు. శ్రీ రామాసేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి జముకల వాయిద్యం కళాకారుడు, చిత్ర పరిశ్రమ ఫోక్ సింగర్ బోనెల ఆసిరయ్య ప్రదర్శించిన సారంగిధర కథ, జానపద పాటలు ప్రేక్షకులను కనువిందు చేశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు ఆర్థిక సహకారం, సంఘం నిధులతో శ్రీ నందన్న ఉత్సవాలు దిగ్విజయంగా చేపడుతున్నామని తెలిపారు. భవన నిర్మాణ కాంట్రాక్టర్ తిలారు శిమ్మన్న మేస్త్రి ఆర్థిక సౌజన్యంతో కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కాస చలపతిరావు, ప్రధాన కార్యదర్శి అర్జాల ఈశ్వరరావు, జాయింట్ కార్యదర్శి సింగుపల్లి జగన్నాదం, మాజీ ఎంపిటిసి బర్రి భూపతి, శ్రీ ఆంజనేయ అభివద్ధి కమిటీ కార్యదర్శి కాస ముకుంధరావు, అక్కుపల్లి యువజన సమితి భిలాయి మాజీ అధ్యక్షులు మడ్డు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు మొరిపల్లి దేవానంద్, గ్రామ సంఘం సభ్యులు, మహిళలు, యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ప్రజలు తమ నివాస ప్రాంతాల్లో ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ఉంటారని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మోహనరావు అన్నారు. శుక్రవారం సరుబుజ్జిలి పంచాయతీ నందికొండలో పంచాయతీ అధికారులతో కలిసి పారిశుధ్య పనుల నిర్వహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మురుగు కాలువలు, ఇతర మురుగు ప్రాంతాల్లో దోమల నివారణ మందులను పిచికారి పారిశుధ్య సిబ్బందితో చేయించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ అపారిశుధ్య ప్రాంతాలలో దోమలు అధికంగా చేరి దోమల కాటు ద్వారా భయంకర వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ఆరోగ్యశాఖ, సచివాలయ, పంచాయతీ అధికారుల సూచన మేరకు ప్రజలు సూచనలు పాటించి సంపూర్ణ ఆరోగ్యానికి అవసరమైన పారిశుధ్య నిర్వహణతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న మోహనరావు

డిజిటల్ సాధనాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి- లావేరు

ప్రతి రైతు డిజిటల్ వ్యవసాయ సాధనాలపై అవగాహన కలిగి ఉండాలని సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వ్యవసాయ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి టి. అమరేశ్వరి అన్నారు. శుక్రవారం బెజ్జిపురంలో రైతులకు డిజిటల్ సాధనాలపై అవగాహన డిజిటల్ గ్రీన్‌ట్రస్ట్ యూత్‌క్లబ్ బెజ్జిపురం ఆధ్వర్యంలో మైక్రోసాఫ్ట్ ఇండియా సహకారంతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎఫ్‌పిఒ సామర్థ్యాన్ని పెంపొందించడం, డిజిటల్ వ్యవసాయ సాధనాల వైపు మళ్లడం, ఫార్మర్ చాట్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్‌ట్రస్టు ప్రోగ్రామ్ మేనేజర్ జి.శ్రీకాంత్, లీడ్ కో-ఆర్డినేటర్ శేష ఫణి, ఎం.రామారావు, ఇజ్జడా అప్పారావు, శ్రీనువాసరావు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి

జిఎస్‌టి తగ్గింపుతో సామాన్యులకు ఊరట

ప్రజాశక్తి- నరసన్నపేట

జిఎస్‌టి 2.0తో అనేక వస్తువుల ధరలు తగ్గాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం శ్రీనివాస్ ఎలక్ట్రానిక్, ఫర్నీచర్ షాపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఆర్థిక భారం తగ్గి, విజయదశమి, దీపావళి పండుగలను మరింత ఆనందంగా చేసుకునే సువర్ణ అవకాశం లభించిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, అసిస్టెంట్ కమిషనర్, జిఎస్‌టి అధికారులు, వ్యాపారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిఎస్‌టి 2.0 సంస్కరణలపై ప్రిన్సిపాల్ పి.లత ఆధ్వర్యంలో విద్యార్థులచే సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో కామర్స్ అధ్యాపకులు కృష్ణవేణి, త్రినాథరావు, తేజోవతి, ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: జిఎస్‌టి చట్టంలో 2.0 పన్ను సంస్కారణల ద్వారా ఇటీవల అమలులోకి వచ్చిన పన్ను రేట్ల తగ్గింపుల ఫలితంగా అనేక వస్తువుల ధరలు తగ్గాయని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రదర్శనలో భాగంగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర జిఎస్‌టి పరిశ్రమల శాఖ, సమాచార సాంకేతిక పరిజ్ఞానం శాఖ సహకారంతో ఒక ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో...

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిఎస్‌టి 2.0 సూపర్ సేవింగ్స్ సెలబ్రేషన్స్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ విశాఖపట్నం జోన్ డాక్టర్ కె.వి.మోహనరావు హాజరై మాట్లాడారు.



శ్రీకాకుళం సిటీ : పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే శంకర్

టెక్కలి రూరల్ : సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ కార్యక్రమం టెక్కలి ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై జిఎస్‌టి రేటు 28 నుంచి 18కి తగ్గిందని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి ఎఎంసి చైర్మన్ బగాది శేషగిరిరావు, అసిస్టెంట్ కమిషనర్ (జిఎస్‌టి) ఎఎన్.వి.ప్రసాద్, తహశీల్దార్ కె.సత్యం, డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ, ఎంపిడిఒ ఎం.రేణుక, డిప్యూటీ ఎంపిడిఒ కె.సింహాద్రి, టెక్కలి వర్తక సంఘం అధ్యక్షులు లాడి శ్రీనివాసరావు, రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు బెలుసోంటి నరసింహమూర్తి, వినియోగదారులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జిఎస్‌టిపై ఎలక్ట్రానిక్ పరికరాల ప్రదర్శన కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కాశీప్రసాద్, వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్, కార్యాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆర్‌పిలు పాల్గొన్నారు.

కవిటి: కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం మండల కేంద్రంలో జిఎస్‌టిపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. అన్ని దుకాణాలకు వెళ్లి ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన జిఎస్‌టి ప్రాప్తికి అమ్మకాలు సాగించాలని సూచించారు. కల్యాణి ఆంగ్ల పాఠశాలలో విద్యార్థులకు జిఎస్‌టిపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ బిందు మాధవి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పలాస: కాశీబుగ్గ సంత మైదానంలో జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, బి.నాగరాజు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎ.అనురాధ పాల్గొన్నారు.

రణస్థలం: రణస్థలంలో జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు, ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకటరమణ, వాళ్ళ రమణ, కరిమజ్జి చంద్రినాయుడు, లంక రామారావు, పెద్ది చిన్నారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో మరొకరికి చూపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నేత్రదానంతో మరొకరికి చూపు లభిస్తుందని రెడ్‌క్రాస్ రాష్ట్రవైస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. నగరానికి చెందిన ఉర్లం శివతేజ పట్నాయక్ శుక్రవారం జన్మదినం సందర్భంగా స్థానిక రెడ్‌క్రాస్ ఆవరణలో నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చి అంగీకార పత్రం అందజేశారు. వెలుగునివ్వాలనే ఆలోచనతో నేత్రదానం చేసినట్లు ఆయన చెప్పారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ కీర్తన ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం పలాస నియోజకవర్గ స్థాయిలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో వైసిపి సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ, నూతన కమిటీల నిర్మాణంపై అవగాహన, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై రచ్చబండ సంతకాల సేకరణ, స్థానిక సంస్థల ఎన్నికల ముందస్తు వ్యూహాలపై ఎజెండాలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి వైసిపి ప్రజా ప్రతినిధులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అన్ని విభాగాల అధ్యక్షులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పొలం బడి క్షేత్రం పరిశీలన

సోంపేట: పాలవలస గ్రామంలో నిర్వహిస్తున్న మేలైన సాగు పద్ధతుల పొలంబడి క్షేత్రాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు వ్యవసాయ సహాయకులు నిర్వహిస్తుండగా మండల వ్యవసాయ అధికారి నరసింహమూర్తి గురువారం సందర్శించారు. రసం పీల్చే పురుగులు, సుడిదోమ, ఆకుపచ్చ దోమ ఉనికిని కనుగొనేందుకు పసుపురంగు జిగురు అట్టలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రానున్న నెల రోజులు చీడ, పీడల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, రైతులు కూడా సహకరించాలని కోరారు.



పనులు పరిశీలిస్తున్న సూరిబాబు

కార్గిల్ పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని కార్గిల్ పార్క్‌ను అతి సుందరంగా ఆధునిక సాంకేతిక ఆధారంగా తీర్చిదిద్దుతామని ఎపి కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సూరిబాబు అన్నారు. పార్కును శుక్రవారం స్థానిక సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పార్క్ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. త్వరలోనే పార్క్‌కు సంబంధించి పనులను ప్రారంభించినున్నట్లు తెలిపారు.



సన్మానం చేస్తున్న తెలుగు యువత ప్రతినిధులు

ఎఎంసి డైరెక్టర్ నియామకం

ప్రజాశక్తి- రణస్థలం

ఎచ్చెర్ల నియోజకవర్గం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా రణస్థలం మండలం టిడిపి సీనియర్ కార్యకర్త కెల్ల అప్పలనాయుడు భార్య కెల్ల భారతిని నియమించారు. ఈ పదవి వచ్చినందుకు రణస్థలం టిడిపి తెలుగు యువత ఆధ్వర్యంలో శుక్రవారం రణస్థలంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తెలుగు యువత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కోఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద సవాళాపురంలో ఆర్‌బిఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ ఎస్ టి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులలో అమలవుతున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎటిఎం కార్డుల వలన కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సోషల్ సొసైటీ ట్రాన్స్ఫర్మేషన్ జిల్లా కోర్డనేటర్ ఎ .హరనాథ్, సరుబుజ్జిలి సిసిడి కనకమహాలక్ష్మి, సిఎఫ్ఎం రమ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని ఎర్రముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ఇదే స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ఆర్మీ ఆర్డినరీ కెప్టెన్ పొట్టి సోమేశ్వరరావు లైబ్రరీలో పుస్తకాలు బద్రపరుచుకునేందుకు గురువారం బీరువా బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనంత, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఆగస్టు నెలలో పాఠశాల ఆవరణలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సోమేశ్వరరావు ఇప్పుడు బీరువా బహుకరించడం ఆనందంగా ఉందని, ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.



బీరువా అందజేస్తున్న సోమేశ్వరరావు